క్లుప్తంగా

నేడు కాశీభట్ల వేణుగోపాల్ సంస్మరణ సభ

ఒంగోలు మెట్రో: ప్రముఖ కథ, నవలా రచయిత కాశీభట్ల వేణుగోపాల్ సంస్మరణ సభను శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలు శ్రీనగర్ కాలనీలోని డాక్టర్ మల్లవరపు రాజేశ్వరరావు భవన్లో నిర్వహించనున్నట్లు జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నేనూ చీకటి, తపన, అసత్యానికి ఆవల, చీకటీగలు, అసంగతం, కాలం కథలు తదితర రచనలు చేసి వడ్డెర చండీ దాస్ వంటి ప్రఖ్యాత రచయితల కోవలో విశేష సాహిత్య కృషి చేసిన వేణుగోపాల్ గురించి పలుగురు సాహిత్యవేత్తలు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సాహిత్య అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్ఎంసీ ఎన్నిక మళ్లీ వాయిదా

నాగులుప్పలపాడు (మద్దిపాడు): మండలంలోని ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 8వ తేదీ ఎస్ఎంసీ ఎన్నికలు జరగ్గా, కోరం లేకపోవడంతో ఈదుమూడి జెడ్పీహెచ్ఎస్‌లో ఎన్నికలు నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ 17వ తేదీ ఎన్నికలు నిర్వహించగా, 7వ తరగతికి తప్ప మిగిలిన తరగతుల ఎన్నికలు పూర్తయ్యాయి. 7వ తరగతికి కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో అధికారులు ఆగస్టు నెలాఖరులోపు ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశాలివ్వడంతో 30వ తేదీ ఎన్నికలకు ఏర్పాటు చేశారు. ఈసారి కూడా 7వ తరగతిలో 12 మందికిగానూ ముగ్గురే హాజరు కావడంతో ఎన్నిక వాయిదా పడింది. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

విద్యా సామగ్రి పంపిణీ

కొత్తపట్నం: మండలంలో డీవై కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల హెచ్ఎం కల్లగుంట వెంకట్రావు అధ్యక్షతన ఎస్ఎంసీ సభ్యులు శుక్రవారం విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, ఎరేజర్లు, కలర్ బాక్సులు, వివిధ రకాల వస్తువులతో పాటు పాఠశాలకు కుర్చీలను వారి సొంత నిధులతో బహూకరించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి–2 టి.పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో 52 పాఠశాలలు ఉండగా, డీవై కాలనీకి ఎస్ఎంసీ సభ్యులు సొంత నిధులతో విద్యా సామగ్రి కొనుగోలు చేసి ఇవ్వడాన్ని అభినందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా పాఠశాలల ఎస్ఎంసీ సభ్యులు కూడా అందించే ప్రయత్నం చేయాలని కోరారు. పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మానికల రమణయ్య, వైస్ చైర్మన్ బాపట్ల శిరీష, సభ్యులు చేవూరి ఊహ, పోట్లూరి మేరి, కత్తి నవ్య, కంది కవిత, సీఆర్పీ శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ కార్మిక కార్యాచరణ దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: అంతర్జాతీయ కార్మిక కార్యాచరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 1వ తేదీ ఒంగోలు నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల సాగర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్రకటించారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, గంటెనపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీఆర్ చౌదరి మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఉదయం 10 గంటలకు సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సాగర్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటారని తెలిపారు.


కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


కొప్పోలు చెన్నకేశవస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో...


లాయర్‌పేటలో రాజరాజేశ్వరి అమ్మవారికి సామూహికంగా కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు
- భారీగా పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఒంగోలు నగరంలోని అమ్మవారి దేవాలయాల్లో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మహిళలు భారీగా పాల్గొనడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారిని విజయదుర్గ అమ్మవారిగా అలంకరించి పూజలు చేశారు. లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి, బాలాజీనగర్‌లోని కనకదుర్గమ్మ దేవస్థానం, మంగమూరు రోడ్డులోని పంచముఖ గాయత్రి అమ్మవారి దేవస్థానం, ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో, సమతానగర్ సాగర్ కాల్వ దగ్గరున్న కనకదుర్గ అమ్మవారి ఆలయం, ఒంగోలు శివప్రసాద్ కాలనీలోని పోలేరమ్మ దేవస్థానం, ఒంగోలు మిలటరీకాలనీ యానాది సంఘంలో కనకదుర్గమ్మ ఆలయం, గద్దలగుంటలోని మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి దేవస్థానంలోని అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఒంగోలు జయరాం థియేటర్ వద్ద గల గోశాలకృష్ణ మందిరంలో, కొప్పోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, నగరంలోని పలు అమ్మవారి దేవస్థానాలలో ఆలయ అర్చకులు మహిళా భక్తులచే సామూహిక వరలక్ష్మీ పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు.

మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ ముఖ్యం


స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్ర రావు , పక్కన ఒంగోలు సబ్ రిజిస్ట్రార్లు సీహెచ్.శ్రీనివాసులు, వాసుదేవరెడ్డి


మద్దిపాడులో మొక్కలు నాటిన ఏపీడీ వెంకటస్వామి, హెచ్ఎం, ఇతర అధికారులు

- విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటడం అలవాటు చేయాలి
- జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్ర రావు

ఒంగోలు సబర్బన్: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ముఖ్యంగా చూసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్ర రావు అన్నారు. మన మహోత్సవం–2024 కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత గుంటూరు రోడ్డులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఉపేంద్రరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హరితాంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఒక యజ్ఞంలా చేపట్టాలన్నారు. ఒంగోలు జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్ చేతుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో పర్యావరణాన్ని సమతుల్యం చేయటానికి విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్ అప్పిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్ బాషతో పాటు చిట్స్ విభాగం, అడ్మినిస్ట్రేటివ్ బ్రాంచ్ విభాగం, ఆపరేషన్ బ్రాంచ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో మొక్కలు నాటిన ఏపీడీ

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ వెంకటస్వామి శుక్రవారం మొక్కలు నాటారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల చుట్టూ మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి వనం మనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ఏపీఓ ధనంజయ, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

ఒంగోలు సబర్బన్: మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఒంగోలు నగర మేయర్ సుజాత పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక 20వ డివిజన్ భాగ్యనగర్ రెండో లైన్‌లో రోడ్ల మార్జిన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు పర్యావరణంపై వాటి ప్రభావం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి పంట సాగులో మెళకువలు పాటించాలి

చీమకుర్తి: పత్తి పంట సాగులో రైతులు మెళకువలు పాటించాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తి మండలంలోని పాటిమీదపాలెం, నాయుడుపాలెం రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగుల నివారణ, మెగ్నీషియం లోపాన్ని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాటికి సంబంధించి రైతులు వాడాల్సిన రసాయనిక మందులపై వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ కే యాకోబు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



నిబద్ధతతో పనిచేస్తేనే రాణింపు


జిల్లా ఉప విద్యాశాఖ అధికారిని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కొత్తపట్నం: వృత్తిలో నిబద్ధతగా పనిచేసినప్పుడే రాణింపు ఉంటుందని జిల్లా ఉప విద్యాశాఖ అధికారిని అనిత రోజ్‌రాణి అన్నారు. మండలంలోని ఈతముక్కల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేలా బోధించినప్పుడే వారి హృదయాల్లో ఉన్నతంగా అధ్యాపకులు నిలిచి ఉంటారని తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఉద్యోగ విరమణ చేయనున్న డిప్యూటీ డీఈఓ అనిత రోజ్‌రాణి చివరిసారిగా కొత్తపట్నం హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతంతో నిరుపేద విద్యార్థులకు కష్టపడి విద్యనందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత 37 సంవత్సరాలుగా విద్యాశాఖలో వివిధ హోదాల్లో తాను అందించిన సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. అనంతరం ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.శ్రీదేవి, ఈతముక్కల హెచ్ఎం చెంచుపున్నయ్య, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సాయి కిషోర్, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, ఉపాధ్యాయులు కలిసి జిల్లా ఉప విద్యాశాఖ అధికారిని అనిత రోజ్‌రాణిని ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు.

హౌసింగ్ బోర్డులో దుర్గంధం


హోటల్ ముందు కాలువలో అడ్డుపడిన ఆహార వ్యర్థాలను బయటకు తీస్తున్న పారిశుధ్య కార్మికుడు


కల్వర్టులోని అడ్డంకులను పొడవాటి బొంగు ద్వారా బయటకు నెడుతున్న కార్మికుడు

ఒంగోలు సబర్బన్: నగరంలోని 19వ డివిజన్‌లో గల హౌసింగ్ బోర్డుకాలనీ ప్రధాన సెంటర్‌లో దుర్గంధం వెదజల్లుతోంది. భాగ్యనగర్ నాలుగో లైన్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న హౌసింగ్ బోర్డుకాలనీ.. ఆ పరిసర ప్రాంతాలకు కేంద్రంగా ఉంది. అయితే, హౌసింగ్ బోర్డుకు–మోడల్ టౌన్‌కు మధ్యలో ఏర్పాటు చేసిన ఓ హోటల్ వలన పరిసర ప్రాంతాలు దుర్గంధంగా మారాయి. హోటల్లోని ఆహార పదార్థాల వ్యర్థాలను మురుగు కాలువలోకి వదలడంతో కాలువలో మురుగునీటి ప్రవాహానికి అడ్డుపడ్డాయి. మురుగంతా ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ప్రధాన రహదారి కింద ఉన్న కల్వర్టులో కూడా హోటల్ వ్యర్థాలు అడ్డుపడి మురుగునీరు పోయేందుకు అడ్డంకిగా మారాయి. బ్యాంకు కాలనీ, మోడల్ టౌన్ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు వెళ్లే వీలులేక రోడ్డు మీదకు చేరింది. దుర్గంధం వెదజల్లుతూ స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. భాగ్యనగర్ నాలుగో లైన్ నుంచి బ్యాంకు కాలనీ, మామిడిపాలెం మీదుగా వెంగముక్కలపాలెం బైపాస్ జంక్షన్‌కు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి ప్రధాన రహదారిలో దుర్భర పరిస్థితి నెలకొన్నా.. ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడలేదని, హోటల్ నిర్వాహకులు కూడా పరిశుభ్రతపై కనీస శ్రద్ధ చూపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. హోటల్ నిర్వాహకులు ఆహార వ్యర్థాలను మురుగు కాలువలో వేయకుండా చర్యలు తీసుకుంటే దుర్గంధంతో పాటు మురుగు సమస్య కూడా ఉండదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి


డాక్టర్ తేజోమూర్తిని సత్కరిస్తున్న ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్, తదితరులు

ఒంగోలు: డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని మలినేని ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ తేజోమూర్తి సూచించారు. శుక్రవారం స్థానిక ఆంధ్రకేసరి కాలేజీలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మంచికంటే చెడుకు యువత ఎక్కువగా ఆకర్షితులు కావడం బాధాకరమని అన్నారు. డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనం అవుతాయని, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, మద్యపానం, పొగాకు, గుట్కా వంటివి వినియోగదారుల్లో అనారోగ్యానికి కారణం అవుతాయని వివరించారు. డ్రగ్స్ వినియోగం మనిషి జీవితాన్ని ఎలా నాశనం చేస్తుంది, దానివల్ల ఎలాంటి అనర్థాలు కలుగుతాయనే దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజమోహన్, సీడీసీ డీన్ డాక్టర్ సోమశేఖర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతందేవ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం డాక్టర్ తేజోమూర్తిని ఘనంగా సత్కరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఒంగోలు టౌన్: విద్యా రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ విమర్శించారు. విద్యారంగాభివృద్ధి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను మూసివేయడానికి తీసుకొచ్చిన 84, 85, 117 జీవోలను వెంటనే ఉపసంహరించాలని, మూసివేసిన పాఠశాలలను వెంటనే తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ పాఠశాలలను పునఃప్రారంభించాలని, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిధులు కేటాయించాలని, కనిగిరిలో ఏర్పాటు చేయనున్న ట్రిపుల్ ఐటీకి నిధులు మంజూరు చేసి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ప్రతి పీజీ విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా వున్న 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సీహెచ్ శ్యాం, అన్వేష్, బాలు, సురేష్ పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాదు ఏకం ఐఏఎస్ అకాడమీకి చెందిన రిటైర్డ్ మేజర్ ఎస్‌పీ ఎస్.ఉబేరాయ్ పాల్గొని ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. యూపీఎస్సీ ద్వారా వివిధ సివిల్ సర్వీసులలో ఉద్యోగ అవకాశాలు, అందుకు కావాల్సిన నైపుణ్యాలు, శిక్షణ, తదితర అంశాల గురించి వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, కాలేజీ సీజీసీ కన్వీనర్ కె.రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

